

# నేనేమైపోవాలి నేస్తం.....?

అన్నంరాజు వేణుగోపాల శ్రీనివాసమూర్తి

"ఎక్కడున్నావ్ దీపూ! నీ కోసం వెతికి వెతికి ఎంతగా అలసిపోతున్నానో తెలుసా? నాకు తెలుసు నువ్వెందుకిలా నిర్దయుగా, శిలా సదృశంగా ప్రవర్తిస్తున్నావో..... ఉద్యోగం లేదని నువ్వెంత బాధపడుతున్నావో నేనర్థం చేసుకోగలను, నిజమే.... నువ్వు బాగా చదువుకున్నావ్..... మంచి నాలెడ్జిబుల్ పర్సన్‌వే.... అందం, ఆకర్షణ ఉన్నాయి. అయితే ఇవి ఉద్యోగం తెచ్చుకోవడానికి తోడ్పడడం లేదనేగా నీ నిస్పృహ! "నీ హయ్యర్ క్వాలిఫికేషన్‌కు తగ్గదికాకపోయినా, ఏదో ఓ చిన్న ఉద్యోగం చేయవచ్చుకదా మంచి అవకాశమేదైనా వచ్చేదాకా' అని నేనంటే కళ్ళురిమి చూశావు. ఆ ఎర్రటి తీవ్రమైన చూపు నన్నెంత బాధపెట్టిందో! నేనా సలహా ఇచ్చాననేగా నాల్రోజులు నా మొహం చూడలేదు!

నీకు జ్ఞాపకం ఉందా? మొదటిసారి లైబ్రరీ దగ్గర నేను నీతో పరిచయం చేసుకుని మాట్లాడినప్పుడు నువ్వెంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తూ చాలా అద్భుతంగా మాట్లాడావు. రవిశంకర్ సితార్ గురించి, గాలిబ్ గజల్ గురించి - ఇంకా నీకు తెలిసిన విషయాలను, నీ అభిరుచులను చెప్తూంటే నా మనసెంత సందడించిందని! టీచర్‌గా పిల్లలకి పాఠాలు చెప్పుకుంటూ, సాయంకాలాల్లో లైబ్రరీకి వచ్చి ఏవో కథలు, కవితలు చదువుకుంటూండే నాకు, నాలోని భావుకుడికి నీ స్నేహం ప్రాణాన్ని పోసింది. నీకనురెప్ప కదలికలలో, పెదవి విరుపులో,

చిత్రంగా మెరిసి మాయమయ్యే ఆ చిరునవ్వులో కదిలే భావాలెన్నో నా కలానికి పనిపెట్టాయి. మరి మరి వినాలనిపించే నీ మాటలు నన్ను నీ వెంట పడేలా చేశాయి. నిన్ను చూస్తూ, నీ మనోభావాలు తెలుసుకుంటూ, నీ సామీప్యంలో నా కవితాత్మను ఆవిష్కరించుకుంటూ నేను పొందిన ఆనందం అనిర్వచనీయం దీపూ!

నన్నూ మాట్లాడమంటావు పార్కులో కూర్చున్నప్పుడు. నేనేదో పొయెటిక్‌గా మాట్లాడుతూంటే "వద్దు..... కథల్లోలా మాట్లాడొద్దు.... కవితా పంక్తులను అలా చదవద్దు.... మామూలుగా ఏదన్నా చెప్పరాదూ?" అని విసుక్కుంటావంతలోనే. నీ అభిరుచి కనుగుణంగా మాట్లాడాలని ప్రయత్నించి నిన్ను అట్రాక్ట్ చేయలేకపోయానని నేను చిన్న బుచ్చుకుంటున్నంతలోనే భుజం తట్టి "ఏదన్నా పాట పాడు మిత్రమా!" అనగానే, నేనే దేవులపల్లి గీతమో ఆలపిస్తూంటే ఎంత అభిమానంగా, ఆత్మీయంగా చూసేవాడివి! ఆ చూపు కోసం, ఆ అభిమానం కోసం నేనెంత తపించిపోతానని!

"నీ స్నేహంతో రోజులు క్షణాల్లా గడిచిపోతూన్నాయి. నేనెంతో ప్లెజెంట్‌గా ఉంటున్నా నీ మధ్య..... గతమెందుకు, భవితవ్యమెందుకు? ఏ రోజుకారోజు ఇలా ఆనందంగా గడిచిపోతే చాలదూ!?" అన్నానోసారి. ఆ తరువాత రెండ్రోజులు నువ్వు కన్పించలేదు. నిన్ను చూడక, నీతో మాట్లాడక, నీ ప్రియ వచనాలు వినక నేనెంత తల్లడిల్లిపోయాను! మూడో నాడు కన్పించావు రోడ్డు మీద పేలవంగా నవ్వుతూ....

పలకరించకపోతే నేనేమన్నా అనుకుంటానన్నట్లు ముక్తసరిగా పలకరించావు. నా వల్ల జరిగిన అపరాధం ఏమిటో నాకు తెలియదు. ఆరోజు చాలాసేపు మాట్లాడుకున్నాం. "నిరుద్యోగిగా ఉండటమే నావైఫల్యం" అన్నావు. "నువ్వు జాబ్ చేస్తూ కబుర్లు చెప్తూంటే, నేనేమీ చేయకుండా వాగుతున్నాను." అని కూడా అన్నావు. నీ కళ్ళల్లో కన్పించిఇన అభద్రతా నైరాశ్య భావన నన్ను కదిలించి వేసింది. నీకోసం ఏదో చేయాలన్న ఆరాటం.... ఏమీ చేయలేని నిస్సహాయత! సలహా ఇస్తే నీ ఆగ్రహానికి, అసహనానికి గురి కావలిసి వుంటుందనే అధీరభావం. క్రమక్రమంగా నీలో భయం, అశాంతి పెరిగిపోతున్నాయనే విషయం నన్ను చాలా వేదనకి గురి చేస్తూంది.

"మా ఇంట్లో అమ్మా, నేనే వుంటాం. నువ్వు మాకేం భారం కాబోవు. నీ కభ్యంతరం లేకపోతే...." నా మాటలు పూర్తి కాకముందే ఉన్నట్టుండి లేచి వెళ్ళిపోయావ్ పార్క్ నుండి. తరువాత మళ్ళీ నాల్రోజులు వెతుక్కోవలసి వచ్చింది నీకోసం. నువ్వెప్పుడూ రమ్మని చెప్పకపోయినా ఓ రోజు మీ ఇంటికి, తెలియక పోయినా వెతుక్కుంటూ వస్తే "ఏ పని మీద వచ్చావింత దూరం?" అన్నావు. నా అభిమానం గాయపడింది. నువ్వున్నస్థితి నీ చేత అలా పరుషంగా పలికింపచేస్తూందని నన్ను నేనే ఊరడించుకున్నాను.

నువ్వు విసుక్కున్నా, కసురుకున్నా నీ స్నేహం లేకుండా ఉండలేననిపిస్తూంది నాకు. "బీచ్‌కి వెళదామా?" అన్నావు ఓసారి. సంబరంగా బయల్దేరాను. సీరియస్‌గా సముద్రాన్ని చూస్తూ నిశ్శబ్దంగా ఉండిపోయావు. నిన్ను కదిలించాలని మాట్లాడాను, పాటలు పాడాను. నీలో స్పందన లేదు. సరదాగా గతంలో నువ్వు చెప్పిన కథలు, విషయాలు రిపీట్ చేసి వినిపించాను మిమిక్రీ ఆర్టిస్ట్‌లా నీకు కోపం వచ్చి పిడికిలి బిగించి, పళ్ళు నూరుతూ వీపు మీద ఒక్కటి వేశావు. నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. లేచి వెడుతూంటే అక్కడేదో చెక్క వుంటే దాన్ని తీసుకుని విసిరావు ఉన్మాదిలా! నా చేతికి బలంగా తగిలింది.

"నువ్వేమైపోతూన్నావో నీకు తెలుస్తోందా అసలు? బొత్తిగా సెన్సాఫ్ హ్యూమర్ లేదు. స్నేహానికి ప్రతిఫలం ఇదేనా?" అని పెద్ద పెద్దగా ఏదేదో అరిచాను. నీకావేశం అతిశయించిందే కాని నా కంట నీరు చూసి రవ్వంత జాలికగలేదు! ఏమనుకోవాలి? నా మీద నాకే జాలి కలిగింది. స్వీయ వ్యక్తిత్వమనే వాస్తవాధీన రేఖను దాటి స్నేహం కోసం పరితపించినందుకు నాకు తగిన శాస్తే జరిగింది! ఇప్పుడేమనుకొని ఏం లాభం? అనుకున్న "పదపోదాం ఇక." అంటే నా చేయి పట్టి కూర్చోపెట్టావు. నా కోపం మంచులా కరిగిపోయింది.

"దరిద్రమనే సముద్రంలో వేదనలనే తెరచాపలెత్తి ప్రయాణం చేసే బ్రతుకు నావలకు మృత్యువే లైట్ హౌస్!" అంటూ ఆ సముద్రం ఒడ్డున చీకటి పడుతున్న వేళ నువ్వు తిలక్ కొటేషన్స్ విన్పిస్తూ, విరక్తిగా నవ్వుతూంటే నువ్వు ఎంత భయంకరమైన మానసిక స్థితిలో వున్నావో గ్రహించి, ఏదో ధైర్యం చెప్పానే కాని నిన్నింక ఎంతో కాలం చూస్తానన్న నమ్మకం నాలో సన్నగిల్లింది. నా అంతరంగం అల్లకల్లోలమైంది.

"నీకు, నీలాంటి వాళ్ళకు అహంకారం ఎక్కువ. ఏవేవో గొప్ప గొప్ప కలలు కంటూంటారు. మీకు కావల్సింది, ఊహించుకుంది మీకు లభించక నిరాశా నిస్పృహలతో తల్లడిల్లి పోతూంటారు. జీవితం కలకాదు. వాస్తవంలో రాజీ పడి బ్రతకటం నేర్చుకోవాలి..... నువ్వు చేయడానికి సిద్ధపడాలే కానీ ఏదో చిన్న ఉద్యోగం దొరక్క పోదు." నువ్వేమనుకుంటావోననే భయాన్ని విడిచిపెట్టి చెప్పదలుచుకున్న నాలుగు ముక్కలూ గట్టిగా చెప్పాను. ఆ మరునాటి నుంచీ కనిపించటం మానేశావు.

'నిన్ను చూసి నెలరోజులకి పైగా అయింది. ఏమైపోయావ్ దీపూ..... ఎక్కడున్నావ్? నాకు కనిపించవా.... మాట్లాడవా? ఆత్మాభిమానం చంపుకోలేని ప్రేమ ఏం గొప్పదని చలం అంటాడని చెప్పావుగా.... అందుకే దాన్ని విడిచిపెట్టి మీ ఇంటికి వస్తే తాళం కప్ప వెక్కిరించింది. ఇరుగూపొరుగుకి మీ విషయాలే తెలియవుట! అయినా లోకంలో ఇంత మంది వుండగా నీతోనే నాకెందుకు స్నేహం కలిసింది? నిన్ను కలుసుకోవటానికి, నీతో మాట్లాడటానికి నా హృదయమెందుకింత ఉవ్విళ్ళూరుతూంది! నీకోసం ఎందుకింత తహతహలాడి పోతూన్నాను? ఈ బంధం నుండి నేనెందుకు బయట పడలేక పోతూన్నాను? దీపూ! నువ్వు కావాలి.... నీ స్నేహమే నాలో నవరాగాన్ని పలికించి ప్రాణాన్ని పోసింది. నీ ఉనికి లేని చోట నేనుండలేక పోతూన్నాను. ప్లీజ్ దీపక్! కన్పించవూ... నన్ను పలకరించవూ!? ఇకపై నిన్నెప్పుడూ ఏమీ అననుగా.... రావూ.... నన్ను చూడవూ?" ❋

## ఛాలెంజ్

లాహిరి లాహిరి లాహిరి లో చిత్రంలో నటి లక్ష్మీ వీరవిహారం చేసింది అంటున్నారు. ముఖ్యంగా దర్శక నిర్మాత చౌదరిగారు మమ్మల్నీ బాగా పిండుకున్నారు అంటోంది లక్ష్మీ.

ఎంత పెర్ఫామెన్స్ చేసినా, ఇంకా చెయ్యాలమ్మా మీరింతకంటే బాగా చేయగలరు అని స్మూత్‌గా చెప్పి మనసు నొప్పించకుండా, ఎక్స్‌ట్రీమ్ పెర్ఫామెన్స్‌ని రాబట్టగలిగారు. నోడవుట్ ఈ సినిమాలో ఛాలెంజింగ్ రోల్ చేశాను. అంటోంది బల్లగుద్ది మరీ.

